సాక్షి సిద్దిపేట

శనివారం ¦ 24 ¦ జూన్ ¦ 2023



మూఢత్వానికి ముగింపేది?

చేతబడి..బాణామతి పేరుతో పచ్చని పల్లెల్లో ప్రతీకారాలు రగిలిపోతున్నాయి. ఫలితంగా అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి.

10లో..



కరెంట్ కష్టాలు తీరేదెప్పుడో?

కరెంట్ పోకుండా 24 గంటల కరెంటు ఇస్తున్నామంటూ ప్రభుత్వం చెబుతుంటే.. ఇందుకు విరుద్ధంగా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదు.

11లో..



బక్రీద్ ఏర్పాట్లపై సమీక్ష

సిద్దిపేటజోన్: బక్రీద్ పండగ నేపథ్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సంపత్ తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య పనులు, తాగునీటి వసతులు, విద్యుత్ ఏర్పాట్లపై ఆరా తీశారు.

న్యూస్‌రీల్

వర్గీకరణ సాధించే వరకు పోరాటం



మాట్లాడుతున్న మైస రాములు మాదిగ

గజ్వేల్: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధించేవరకు పోరాటం ఆగదని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు మైస రాములు మాదిగ అన్నారు. ఈనెల 25న సిద్దిపేటలో నిర్వహించనున్న మందక్రిష్ణ మాదిగ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు శుక్రవారం గజ్వేల్‌లో మాదిగ ఉప కులాలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29ఏళ్లుగా వర్గీకరణ సాధనకు మందక్రిష్ణ మాదిగ సాగిస్తున్న పోరాటం గొప్పదన్నారు. ఆయన బాటలో ముందుకు సాగి రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–సెర్ప్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ... వందే భారత్ ట్రెస్ ఐఆర్‌సీటీసీ ఔట్ సోర్సింగ్‌లో రైల్ హోస్టెస్, గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, ఫుడ్ బేవరేజ్ సూపర్ వైజర్లు, బీజెడ్ ఫిన్ సర్వ్ ప్రైవేట్ కంపెనీలో కస్టమర్ రిలేషన్ షిప్ అసోసియేట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ చదివిన 18–40ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగులు హాజరుకావచ్చని తెలిపారు. మండల మహిళా సమాఖ్య భవనంలో జరగనున్న జాబ్ మేళాకు ఉదయం 10 గంటల వరకు రావాలని సూచించారు.

ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం సిద్దిపేట టాస్క్‌ఫోర్సు సీఐ రమేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల్లో కాలం చెల్లిన 75 విత్తన ప్యాకెట్లు, 60 లీటర్ల పురుగుల మందులు, 55 కిలోల పౌడర్, 75 కిలోల విడి విత్తనాలు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకుని స్థానిక వ్యవసాయాధికారి గోవిందరాజులుకు అప్పగించారు. జ్యోతి ట్రేడర్స్, తెలంగాణ ట్రేడర్స్, బాలాజీ రైతు సేవాకేంద్రం, శ్రీ లక్ష్మీ రైతు సేవా కేంద్రాలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్సు సీఐ మాట్లాడుతూ.. రైతులకు కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

సిద్దిపేటజోన్: నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైనవి రైతులకు అందించాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భైరవ రెడ్డి కోరారు. శుక్రవారం సిద్దిపేట మార్కెట్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలని సూచించారు. ఎరువులను అందుబాటులో ఉండేలా చూడాలని, పంట నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, రాంచందర్ రావు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్): ముస్త్యాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం మద్దూరు మండల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మద్దూరు ఏఈ సుధీర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండపాక(గజ్వేల్): రాజీవ్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామ శివారులోని బస్టాప్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో బండి అరుణ్‌కుమార్ (40) అక్కడిక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలంలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు సిద్దిపేటలోని శివాజీనగర్‌వాసిగా గుర్తించారు.

చదువుకొనేది కష్టమే!

ప్రైవేట్ స్కూళ్లలో నిలువు దోపిడీ

- పుస్తక వ్యాపారులతో కుమ్మక్కై అధిక ధరలకు విక్రయం
- తప్పక కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారులు

సాక్షి, సిద్దిపేట: ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చదివించాలంటే ఈ రోజుల్లో మధ్యతరగతి కుటుంబాలకు కష్టమైపోతుంది. అక్కడ ఫీజులే కాదు.. స్కూల్ పుస్తకాలు, నోట్ బుక్కులు, వర్క్ బుక్‌లు, స్టేషనరీ కొనాలన్న తలకుమించిన భారమవుతోంది. ప్రైవేట్ పబ్లికేషన్లు, బుక్ స్టాల్స్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు కుమ్మక్కై అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారు.

- సిద్దిపేట పట్టణంలోని కాంచీట్ చౌరస్తాలో రెండు బుక్‌స్టాల్స్ ఉన్నాయి. వీటిల్లో కొన్ని ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన పుస్తకాలు, నోట్ బుక్స్, స్టేషనరీలు విక్రయిస్తారు. పాఠశాల పేరు, తరగతి చెప్పగానే ఎన్ని డబ్బులు అవుతాయో చెబుతారు. గురువారం ఓ ఆటో డ్రైవర్ 3వ తరగతి చదువుతున్న కుమారుడికి బుక్స్ కొనడానికి వెళ్లాడు. బుక్ స్టాల్‌లో స్కూల్ పేరు, తరగతి చెప్పగానే రూ4,935 అవుతుందని చెప్పారు. ఏమైనా డిస్కౌంట్ ఇవ్వండి అని అడిగితే రూ4,800 ఇవ్వమని చెప్పాడు. మూడో తరగతి పుస్తకాలకు ఇన్ని డబ్బులా అడగడంతో బుక్స్ లేవు ఏమి లేవు పో అని ఆ బుక్ స్టాల్ నిర్వాహకుడు దబాయించాడు. బయట కొందామంటే లభించని పరిస్థితి. చేసేదేమి లేక ఇంటికి వెళ్లి తెలిసిన వారి దగ్గర డబ్బు అప్పు తీసుకుని వచ్చి పుస్తకాలు తీసుకున్నాడు. ఇలా ఉంది బుక్ స్టాల్స్ నిర్వాహకుల దోపిడీ. ఇదే విధంగా జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ స్కూళ్లకు లింక్ ఉన్న బుక్ స్టాల్‌లలో దందా సాగుతోంది.
- ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్‌లు, స్టేషనరీ పేరుతో దోపిడీ జరుగుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



సిద్దిపేటలోని ఓ బుక్ స్టాల్‌లో పుస్తకాలు కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

జిల్లాలో 228 ప్రైవేట్ పాఠశాలలు

- జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు 228 ఉండగా, అందులో సుమారు 60వేలకు మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.
- విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు వ్యాపారానికి తెరలేపాయి. ప్రతీ యేడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే వివిధ ప్రైవేట్ పబ్లికేషన్ల ఎగ్జిక్యూటివ్‌లు, బుక్‌స్టాల్ యాజమాన్యాల ద్వారా పుస్తకాల ఎంపిక జరుగుతుంది.
- ఆయా పబ్లికేషన్లకు సంబంధించిన పుస్తకాలను స్కూల్‌లో పెడితే యాజమాన్యాలకు ముందుగానే గిఫ్టులు అందుతాయి. అంతేకాకుండా పుస్తకాలపై ఇష్టానుసారంగా ధరలను ప్రింట్ చేసి బుక్‌స్టాళ్ల ద్వారా అమ్మిస్తున్నారు.
- ఒకటో తరగతికి రూ3వేలు, రెండో తరగతికి రూ.4వేలు, మూడో తరగతికి రూ.4,800 ఇలా పుస్తకాలు, నోట్ బుక్‌లు, స్టేషనరీకి ధరలు ఫిక్స్ చేసి బుక్ స్టాల్ నిర్వాహకులు విక్రయిస్తున్నారు. పాఠశాలలు ఎంపిక చేసిన పుస్తకాలు ఒకే బుక్ స్టాల్‌లో లభిస్తాయి. ఇలా బుక్‌స్టాల్ నిర్వాహకులకు, పాఠశాల యాజమాన్యాలకు ఆర్థికపరమైన లింకులు ఉంటాయి. దీంతో తప్పని పరిస్థితిలో ఆ బుక్‌స్టాళ్లలోనే విద్యార్థుల తల్లిదండ్రులు పుస్తకాలు కొనాల్సి వస్తుంది.
- స్టేట్ సిలబస్ చదివే విద్యార్థులకు ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలు తీసుకుంటే సరిపోతాయి. పరీక్షలు స్టేట్ సిలబస్‌లోనే రాయాల్సి ఉంటుంది. కానీ ఐఐటీ, టెక్నో అంటూ కార్పొరేట్ పాఠశాలలు సొంత పుస్తకాలు తయారు చేస్తున్నాయి. దాదాపుగా ప్రైవేటు పాఠశాలలన్నిట్లోనూ కంటెంట్ ఒకటే అయినా యాజమాన్యం పేరు, అట్టాలు, రంగులు మారుస్తుంటారు. ఇలా పుస్తకాలు తయారు చేస్తూ అధిక ధరలు పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. ఇవన్నీ కొన్నాక స్టేట్ సిలబస్ పుస్తకాలు కూడా కొనుక్కోవాలని సూచిస్తున్నారు.

కొరవడిన నిఘా

ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఇస్తే తప్ప జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీ చేయడం లేదు. ఇటీవల హుస్నాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారని స్థానికులు సమాచారం ఇవ్వడంతో సీజ్ చేశారు. కానీ బుక్ స్టాళ్లపై అధికారులు నిఘా పెట్టడంలేదు. దీంతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు, బుక్ స్టాల్ నిర్వాహకులు అధిక ధరలకు వారికి ఇష్టమైన పుస్తకాలను విక్రయిస్తూ దండుకుంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి పెట్టి ప్రైవేట్ పాఠశాలు, బుక్ స్టాళ్ల దోపిడీని కట్టడి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

“ తనిఖీలు చేస్తాం..

ప్రైవేట్ పాఠశాలలలో తనిఖీలు చేస్తాం. పుస్తకాల కౌంటర్‌లు ఉంటే చర్యలు తీసుకుంటాం. స్కూళ్లలో, బుక్ స్టాల్స్‌లో అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్నారని పలువురు నా దృష్టికి తీసుకొచ్చారు.

– శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ



జూనియర్ కళాశాలలో దుర్గంధం వెదజల్లుతున్న టాయిలెట్లను చూసి ముక్కు మూసుకున్న జడ్జి

ఇవేం టాయిలెట్లు

మీ ఇళ్లలో ఇలాగే ఉంటాయా అని జడ్జి ఆగ్రహం

హుస్నాబాద్: టాయిలెట్లు కంపుకొడుతున్నాయి.. మీ ఇళ్లలో ఇలాగే ఉంటాయా అని కళాశాల అధ్యాపకులపై హుస్నాబాద్ సివిల్ కోర్టు జూనియర్ జడ్జి శివరంజని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లోని టాయిలెట్ల నిర్వహణపై శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అన్ని కళాశాలల్లో టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటం చూసి జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నింటికి తాళాలు వేసి ఉండటం చూసి విస్మయం వ్యక్తం చేశారు. అధ్యాపకుల టాయిలెట్లు శుభ్రంగా ఉండి, విద్యార్థులవి అధ్వానంగా ఉండటంపై మండిపడ్డారు. కళాశాలలకు ఇంకా విద్యార్థులు రావడం లేదని, అందుకే టాయిలెట్లు శుభ్రం చేయలేదని అధ్యాపకులు తెలిపారు. పిల్లలు వస్తేనే టాయిలెట్లు శుభ్రం చేస్తారా అని జడ్జి మందలించారు. కళాశాలలకు విద్యార్థులు వస్తేనే మీకు ఉద్యోగాలు ఉంటాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. వారం రోజుల్లో మళ్లీ వస్తా, పరిస్థితి ఇలాగే ఉంటే హైకోర్టుకు రిపోర్టును పంపుతానని హెచ్చరించారు.



ఎన్సాన్‌పల్లి రెసిడెన్షియల్ కళాశాలలో టాయిలెట్స్‌ను పరిశీలిస్తున్న జడ్జి స్వాతిరెడ్డి

ఎన్సాన్‌పల్లి రెసిడెన్షియల్ కళాశాలలో..

సిద్దిపేటఅర్బన్: మండలంలోని ఎన్సాన్‌పల్లి రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలను సిద్దిపేట కోర్టు సీనియర్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి మరుగుదొడ్లను ఆమె పరిశీలించారు. వీటి పరిస్థితిపై హైకోర్టుకు నివేదిక సమర్పిస్తానని తెలిపారు.

విద్యార్థికి కలెక్టర్ అభినందన

సిద్దిపేటరూరల్: జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్డ్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి మలఫణి తుషార్‌ను శుక్రవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సన్మానించారు. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియాలో నాలుగో ర్యాంకు, అడ్వాన్స్డ్‌లో ఆల్ ఇండియా 23వ ర్యాంక్ సాధించిన సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల డీజీఎం లక్ష్మణ రావు, ఏజీఎం సదాశివరెడ్డి, రీజినల్ ఇంచార్జ్ రాజు, ఏజెడ్‌పీసీ లక్ష్మీనాయుడు, ప్రిన్సిపాల్ సునయన, ఐపీఎల్ ఇంచార్జ్ అనిల్, ఎంపీఎల్ ఇంచార్జ్ సుమన్ తదితరులు పాల్గొన్నారు



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

మహోన్నతుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి జాతీయవాద ఆలోచనను ప్రోత్సహించి, దేశంలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయ మార్గం చూపిన మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో సంపూర్ణంగా విలీనమైన జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా ఉద్యమించారని, కశ్మీర్ కోసం తన ప్రాణాలనే త్యజించిన మహనీయుడు ముఖర్జీ అని అన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్ రావు, గుండ్ల జనార్దన్, నరసింహారెడ్డి, గోనె మార్కండేయులు, అంబటిపల్లి శ్రీనివాస్, బాదన్నగారి యాదన్ రావు, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, భోగి శ్రీనివాస్, కృష్ణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను జిల్లా కేంద్రంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గాడిపల్లి అరుణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మల్లన్న ఆలయంలో బహిరంగ వేలం



టెండర్లు నిర్వహిస్తున్న ఆలయ ఈఓ బాలాజీ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం పలు అంశాలపై ఈటెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం పాటలను ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లన్న సమావేశ మందిరంలో ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయల విక్రయం, కొబ్బరి ముక్కల సేకరణ, తలనీలాల సేకరణ, మొక్కుబడి బియ్యం, వస్త్రాలు, పసుపు సేకరణ, కోరమీసాలు అమ్ముకునే హక్కులు, సులబ్ టాయిలెట్ల నిర్వహణ, సెల్‌ఫోన్ కౌంటర్ నిర్వహణ, ప్రసాదాల ప్యాకింగ్, ఎల్లమ్మ ఆలయం వద్ద పూజా సామగ్రి అమ్ముకునే హక్కులు పొందేందుకు ఈటెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. సరైన పాట రాకపోవడంతో తలనీలాల సేకరణ, ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయం, కోరమీసాల విక్రయం, స్వామి వారి మొక్కుబడి బట్టలు, ఒడి బియ్యం, పసుపు సేకరణ హక్కులకు సంబంధించిన టెండర్లను వాయిదా వేశారు. వీటిని వచ్చే నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. టెండర్లు జరిగిన వాటి ద్వార ఆలయానికి రూ 60 లక్షల 14 వేల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో జడ్పీటీసీ సిద్దప్ప, ఆలయ ఏఈవో అంజయ్య, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ ధర్మకర్తలు రఘువీరరెడ్డి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

డబ్బు ప్రభావం లేకుంటే కమ్యూనిస్టులదే గెలుపు

మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుంటే కమ్యూనిస్టులే విజయం సాధిస్తారని జనగామ మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని షాదీఖాన ఫంక్షన్ హాల్‌లో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అందె అశోక్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజారెడ్డి మాట్లాడుతూ రాజకీయాన్ని వ్యాపారంగా మార్చారని, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఎన్నికల్లో గెలిచిన నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నిజాయితీగా ఓటింగ్ జరిగితే ప్రజలు కమ్యూనిస్టులనే గెలిపిస్తారన్నారు. థామాషా ఎన్నికల విధానం అమలుచేస్తే చట్టసభల్లో కమ్యూనిస్టుల గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ఆయన తన స్వప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని ఆ పార్టీ కార్యకర్తలే విమర్శిస్తున్నారన్నారు. మతోన్మాద, కార్పొరేట్ బీజేపీని తరిమికొట్టకపోతే దేశానికి రక్షణ ఉండదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మభ్య పెడుతుందన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం పోరాటాలు చేస్తున్నా ఎమ్మెల్యే, మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పాతూరి సుగుణమ్మ, సాయన్న, నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు జనార్దన్, భూమయ్య, బాలుమోహన్, నర్సింహచారి, సోమయ్య, పాండు, మల్లేష్, నరేష్, భాస్కర్‌రెడ్డి, మమత, సుదర్శన్, ప్రశాంత్‌రెడ్డి, మధు, అంజయ్య, నాగరాజు, సత్తయ్య, సీతారాం, యాదగిరి, సురేందర్, కనకయ్య, రవి, భద్రయ్య, సత్తయ్య, శంకరయ్య, ప్రతాప్‌రెడ్డి, స్వామి, స్వామి దాస్, బాలయ్య, ప్రతాప్, యాదగిరి, వెంకట్‌రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

బీడీ కార్మికులకు అండగా ఉంటా

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మెంబర్ మంచె నర్సింలు

దుబ్బాకటౌన్: బీడీ కార్మికుల సంక్షేమం కోసం 20 ఏళ్లుగా పనిచేస్తున్న దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటకు చెందిన మంచె నర్సింలును తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనను దుబ్బాకలోని దేశాయి కంపెనీలో ప్యాకింగ్ కార్మికులు, బట్టి కార్మికులు ఘనంగా సన్మానించారు. స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించడంపై సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీడీ కార్మికుల కష్ట సుఖాల్లో అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.



నర్సింలును సన్మానిస్తున్న కార్మికులు

పేదల భూమితో సీఎం వ్యాపారం

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ నేత కోదండరెడ్డి

వర్గల్(గజ్వేల్): పేదల అసైన్‌మెంట్ భూములతో సీఎం కేసీఆర్ వ్యాపారం చేస్తున్నారని, కార్పొరేట్లకు కట్టబెట్టి సొమ్ము చేసుకుంటున్నారని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. వర్గల్ భూనిర్వాసితులకు అండగా కాంగ్రెస్ పోరాటం చేస్తుందని తెలిపారు. శుక్రవారం వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో చట్టపరమైన పరిహారం ఇవ్వాలనే డిమాండ్‌తో మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో అవుసులోనిపల్లి, రామక్కపేట, నగరంతండా నిర్వాసితులు చేపట్టిన దీక్షకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, అఖిల భారత కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, పీసీసీ కార్యదర్శి ప్రమోద్ కుమార్, డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేద రైతులకు పంచిన అసైన్‌మెంట్ భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం చట్ట విరుద్ధంగా లాక్కుంటుందని మండిపడ్డారు. వైఎస్సార్ హయాంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటుచేసి సాదాబైనామాలు, కబ్జాదారులను గుర్తించి 6,35,000 ఎకరాలకు పట్టా పాసుబుక్కులు ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణలోని 24 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములపై సీఎం కేసీఆర్ కన్ను పడిందని ఆరోపించారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్టు పేర్కొంటూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని ఎండగట్టారు. ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు పేరుతో వర్గల్ తదితర గ్రామాల్లో 1500 ఎకరాల భూమిని సేకరించి తన అనుయాయులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. వర్గల్ భూనిర్వాసిత రైతులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, లీగల్ సెల్ గోపాలరావు, మాజీ జెడ్పీటీసీ ప్రభుదాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, భాస్కర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సదానందరెడ్డి, సుల్తాన్, ప్రవీణ్‌గౌడ్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పక్కన కోదండరెడ్డి, నర్సారెడ్డి తదితరులు

క్లుప్తంగా

ఫ్రెండ్లీ పోలీస్‌లా పనిచేస్తే మంచి ఫలితాలు


డీఎస్పీగా పదోన్నతి పొందిన వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న పోలీసులు

పటాన్‌చెరుటౌన్‌: ప్రజలకు రక్షణ కల్పిస్తూ..ఫ్రెండ్లీ పోలీసు వాతావరణంలో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని డీఎస్పీగా పదోన్నతి పొందిన వేణుగోపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు క్రైం సీఐ లాలూనాయక్, ఎస్‌ఐలు ప్రసాద్‌రావు, రామనాయుడు, క్రైంఎస్‌ఐ పవన్, ఎస్‌ఐ దుర్గయ్య తదితరులు వేణుగోపాల్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో మూడేళ్ల పాటు పనిచేయగలిగానన్నారు. ఎక్కడకు వెళ్లినా పటాన్‌చెరు పీఎస్ సిబ్బందిని గుర్తుంచుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి, మల్లయ్య, జగదీష్, వీవీఎస్ ఎన్ రాజు, రైటర్ నరేష్, అమర్, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


యాదగిరి (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తి మూడు రోజుల తర్వాత శవమై కనిపించాడు. రాయపోలు ఎస్‌ఐ మహబూబ్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లపల్లికి చెందిన చిన్నొల్ల యాదగిరి (43) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ నెల 20న తెల్లవారుజామున భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రాయపోలు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లి అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకున్నట్టు రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించి చనిపోయింది యాదగిరి అని నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి..

కొమురవెల్లి(సిద్దిపేట): మద్యం తాగి ఓ వృద్ధుడు చనిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికి చెందిన గీస కిష్టయ్య(70) గురువారం పింఛన్ డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత మద్యం సేవించాక నిర్మాణంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లోకి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం పడుకున్న చోటే మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు..

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుదాఘాతంతో ఓ ఆవు మృతి చెందింది. గ్రామస్తులు, బాధితుల వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రైతు రాజేందర్ ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం ఆవును మేపేందుకు పొలానికి తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.70 వేలకు పైగా ఉంటుందన్నారు.

మూఢత్వానికి ముగింపేది?

తాటి జాన్‌రెడ్డి / సంగారెడ్డి డెస్క్

అనాగరికమా.. ఆటవికమా..
అమానుషమా.. అవివేకమా
అనారోగ్యమా.. అనుమానమా..
భూతగాళ్లు.. మంత్రగాళ్లు..
యంత్రాలు.. తంత్రాలు..

ఈ నవయుగంలోనూ కొందరి ప్రవర్తన విస్తుగొల్పుతోంది. చేతబడి..బాణామతి పేరు ఏదైతే నేం..పచ్చని పల్లెల్లో ప్రతీకారాలు రగలిపోతున్నాయి. ఫలానా వారి వల్ల మీ కుటుంబంలో అశాంతి చెలరేగింది. మీ అనార్యోగానికి కారణం వారే.. మీ ఇంట్లో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలకు ఫలానా వారే ఇది చేశారంటూ భూత వైద్యులు, మంత్రగాళ్లు చెప్పే మాటలను గుడ్డిగా నమ్మేస్తున్నారు. ముందూవెనుకా ఆలోచించకుండా భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. ఫలితంగా అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

మనిషిలో హేతుబద్ధమైన ఆలోచన, సైంటిఫిక్ టెంపర్ లేకపోవడం వల్లే మూఢత్వం తలకెక్కి ఉన్మాదంలోకి వెళుతున్నారు. తోటివారిని ఏం చేస్తున్నారో కూడా అర్థంకాని అయోమయస్థితికి లోనవుతున్నారు. ఫలితంగానే మంత్రాలు, తంత్రాలు చేస్తున్నారని, చేయిస్తున్నారని దాడులకు తెగబడుతున్నారు.

శాస్త్రీయ దృక్పథం పెరగాలి

సైన్స్ అండ్ టెక్నాలజీ నిత్యజీవితంలో భాగమైపోయింది. దీని అవసరం లేకుండా అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నాం. మూఢత్వం తగ్గాలంటే మనుషుల్లో వైజ్ఞానిక ఆలోచనలు పెరగాలి. అయితే ఆ దిశగా మన దగ్గర జరుగుతున్న ప్రయత్నాలు నామమాత్రమే. ప్రభుత్వాలు కూడా సైన్స్ పరిశోధనలకు కేటాయిస్తున్న నిధులు కూడా అరకొరగానే ఉంటున్నాయి. నోబెల్ గ్రహీత వెంకట్రామన్ రామకృష్ణన్ మాటల్లో చెప్పాలంటే ''ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సర్కస్ కంపెనీలా తయారైంది''. మనదేశ సైన్స్ పరిశోధనల స్థాయిని ఇతర దేశాలతో పోల్చిచూస్తే నాణ్యతలోనూ, సంఖ్యలోనూ వెనుకబడి ఉన్నాం. యూనివర్సిటీలు, సైంటిఫిక్ లేబొరేటరీస్‌కు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలి. రాష్ట్ర స్థాయిలో కూడా స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టెక్నాలజీకి నిధుల కేటాయింపులు పెరగాలి. అప్పుడు సైన్స్ పరిశోధనలు విరివిగా జరుగుతాయి.

చెట్టుకు వేలాడదీసి.. తాళ్లతో కట్టేసి

ముత్తంగి యాదయ్య– అమృత దంపతులిద్దరూ సదాశివపేట మండలంలో కొల్కూర్‌లో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చేతబడి చేస్తున్నారనే నెపంతో ఈ నెల 17వ తేదీన ఉదయం అదే గ్రామానికి చెందిన కొందరు యాదయ్య,అమృతలను తాళ్లతో కట్టేసి కొట్టుకుంటూ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చారు. అంతటితో ఆగకుండా దంపతులిద్దరినీ చెట్టుకు వేలాడదీసి కట్టేశారు. అందరూ చూస్తుండగానే కట్టెలతో దాడి చేశారు. కొంతమంది గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో వారు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. నిందితుల కుటుంబసభ్యుల్లో కొందరు అనారోగ్యానికి గురికాగా, క్షుద్రపూజలు చేసే వ్యక్తిని సంప్రదించగా, మీ ఇంటి పక్కన ఉండే వ్యక్తే ఇదంతా చేయించాడని చెప్పడంతో వెనుకాముందూ ఆలోచించకుండా దాడికి పాల్పడ్డారు.



చట్టాలేవీ?

మూఢత్వానికి అడ్డుకట్ట వేయాలంటే తప్పని సరిగా చట్టాలు అవసరం. అలాంటి చట్టాలు మన రాష్ట్రంలో లేవు. కనీసం మూఢ నమ్మకాల నిరోధకానికి ఏదైనా చట్టాలు చేయాలనే ఆలోచన పాలకులకు రాలేదు. బిహార్, ఒడిశా, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో బ్లాక్ మ్యాజిక్ నిరోధక చట్టాలు అమలులో ఉండగా, మన పొరుగునే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనూ మూఢ నమ్మకాల నిరోధక చట్టాలు ఉన్నాయి.

ప్రతి పౌరుడి విధి

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవడం ప్రతి పౌరుడి విధి అని మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ చెబుతోంది. వైజ్ఞానిక పరిశీలనా స్ఫూర్తి, మానవవాదం, సంస్కరణల అభిలాష ప్రతిఒక్కరూ పెంపొందించుకోవాలి. ఇది పాలకులు కూడా బాధ్యతగా భావించాలి. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందంటూ గొంతెత్తేవారు ప్రాథమిక విధులను కూడా ఆచరించాలి కదా..అందరూ అనుసరించేలా చూడాలి కదా.

సినిమాలు, టీవీ సీరియళ్లల్లో..

ప్రస్తుతం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి తీస్తున్న సినిమాలు కూడా మూఢత్వాన్ని పెంపొందించేలా ఉంటున్నాయి. ఇక టీవీ సీరియళ్లు, వెబ్ సిరీస్‌లు అయితే సరేసరి. అత్తాకోడళ్ల పంచాయితీ, కుటుంబసభ్యుల తగాదాల నేపథ్యంలో ఒకరిపై మరొకరు ఆధిపత్యం చెలాయించేందుకు భూతగాళ్లు, మంత్రగాళ్లను సంప్రదిస్తున్నట్టుగా చూపుతున్నారు. ఈ ధోరణిలో మార్పు రావాలి. సమాజానికి సందేశం ఇచ్చేలా, ప్రజల్లో చైతన్యం పెంపొందేలా, అందరినీ జాగృతం చేసేలా సినిమాలు, సీరియళ్లు రావాల్సిన అవసరముంది.

కళాజాతాలేవీ ?

సామాజిక, సాంఘిక దురాచారాలను రూపుమాపేలా ప్రజలను చైతన్యపరచడంలోనూ, జాగృతపరచడంలోనూ కళాజాతాలు ఒకప్పుడు తమవంతు పాత్ర పోషించేవి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కళాజాతాల పాత్ర నామమాత్రంగానే ఉందని చెప్పవచ్చు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బాణామతి నెపంతో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రాత్రంతా నిర్బంధించారు

రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం అనారోగ్యంతో బాధపడుతోంది. వారికి ఆర్థికంగా ఇబ్బందులు కూడా ఎదురయ్యాయి. మంత్రగాడితో శాంతిపూజ చేయిస్తే అన్ని సమస్యలు తొలగిపోతాయని కొందరు చెప్పారు. సిద్దిపేట జిల్లా నారాయణపేటకు చెందిన ఓ మంత్రగాడిని 18వ తేదీ రాత్రి పిలిపించారు. వస్తూవస్తూ తన వెంట ఓ పంది, అవసరమైన పూజాసామగ్రి తీసుకొచ్చాడు. అర్ధరాత్రి అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇంట్లో తవ్వకాలు మొదలుపెట్టారు. ఈ చప్పుడుకు కాలనీవాసులు మేల్కొన్నారు. సంఘటన స్థలంలోకి వెళ్లి మంత్రాలు చేయడానికి వచ్చావా అంటూ ఆ మంత్రగాడిని, ఆ ఇంటి యజమానిని కూడా బయటకు తీసుకొచ్చి చితకబాదారు. అంతటితో ఆగకుండా రాత్రంతా కమ్యూనిటీ హాలులో నిర్బంధించారు. సోమవారం ఉదయాన్నే పోలీసులు వచ్చి గ్రామస్తులకు అవగాహన కల్పించి ఇద్దరినీ విడిపించారు.


పూజల కోసం తీసుకొచ్చిన వరాహం ఇదే


కమ్యూనిటీ హాల్ వద్ద గుమిగూడిన గ్రామస్తులు

అనారోగ్యనెపంతో దాడి



సంగెపు దమ్మయ్య(60) మెదక్ పరిధిలోని ఔరంగాబాద్‌లో నివాసముంటున్నాడు. దమ్మయ్య ఇంటి సమీపంలోని పలువురు అనారోగ్యానికి లోనయ్యారు. వారిలో ఇద్దరు చనిపోయారు. దమ్మయ్య బాణామతి చేయడం వల్లే ఆరోగ్యాలు దెబ్బతిన్నాయని, చనిపోతున్నారని నమ్మిన బాధిత కుటుంబాలకు చెందిన కొందరు ఈ నెల 10వ తేదీన బజారులోకి లాక్కెళ్లారు. అంతటితో ఆగకుండా దాడి చేశారు. దీంతో దమ్మయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. అదేరోజు రాత్రి కుటుంబసభ్యులు మెదక్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

వైజ్ఞానిక ఆలోచనలు పెంపొందించాలి



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజల్లో వైజ్ఞానిక దృక్పథం పెంపొందించేలా పాలకులు కృషి చేయాలి. మానవ హక్కుల పరిరక్షణ, హేతువాద దృక్పథం పెరగాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధనలకు అధిక నిధులు కేటాయించాలి. మూఢ నమ్మకాల నిరోధానికి కూడా చట్టం చేయాలంటూ ఒక డ్రాఫ్ట్ కూడా తయారు చేశాం.

– రమేష్, విజ్ఞానదర్శిని వేదిక

నీట మునిగి ఇద్దరు మృతి


దాన రోహిత్ మృతదేహం


చిలుముల పవన్ మృతదేహం


(ఇన్‌సెట్‌లో) పవన్ (ఫైల్)

ఒకరిని కాపాడబోయి మరొకరు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రమాదవశాత్తు నీటమునిగి ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం .. మండల పరిధిలోని వీరాపూర్ గ్రామానికి చెందిన చిలుముల పవన్(22), గాలిపెల్లి ఉదయ్ కుమార్, సికింద్రాబాద్‌లోని చిలకలగూడ హమాలీ బస్తీకి చెందిన దాన రోహిత్(16)లు శుక్రవారం గ్రామ సమీపంలోని వరదకాల్వ వద్ద మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఈక్రమంలోనే చేతులు కడుక్కొని వస్తానని వెళ్లిన రోహిత్ కాల్వలో పడి నీటలో మునిగిపోయాడు. అది గమనించిన పవన్ వెంటనే కాల్వలోకి దూకి రోహిత్‌ను రక్షించే ప్రయత్నం చేశాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటిలో మునిగారు. కాల్వ పక్కనే ఉన్న ఉదయ్‌కుమార్ తాడు సహాయంతో వారిని రక్షించేందుకు ప్రయత్నించగా, అది సాధ్యం కాలేదు. వెంటనే ఉదయ్ రోడ్డు పైకి వచ్చి కేకలు వేయగా స్థానికులు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్ జాలరులతో వరదకాల్వలో గాలించగా ఇద్దరి మృతదేహాలు లభించాయి. గతంలో పవన్ తండ్రి అంజయ్య కూడా బావిలో పడి మరణించారు. పవన్, రోహిత్‌లిద్దరూ బంధువులు. పవన్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు..

కొండపాక(గజ్వేల్): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లికి చెందిన తాళ్లపల్లి పరశరాములుగౌడ్‌పై అదే గ్రామానికి చెందిన బూడిత సుమలత ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో విచారణ నిమిత్తం వెళ్లిన పోలీసులపై నిందితుడు మద్యం సేవించి బూతు తిట్టడంతోపాటు విచారణకు సహకరించలేదు. అంతేకాకుండా పోలీసుల చేతిలో ఉన్న హ్యాండ్‌సెట్ లాక్కున్నాడు. విచారణకు వెళ్లిన పోలీసులు కృష్ణమూర్తి, బాలరాజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సంగారెడ్డి టౌన్: గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది రోడ్డు బ్రిడ్జి కింద శుక్రవారం సంగారెడ్డి రూరల్ పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని కనుగొన్నారు. మృతుడి వయస్సు 30 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఎర్ర రంగు టీ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

సంగారెడ్డి టౌన్: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సంగారెడ్డి టౌన్ సీఐ శ్రీధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి పట్టణంలోని ఓడీఎఫ్ కాలనీలో నివాసం ఉంటున్న గుండు సునీత ఇంట్లో ఎవరులేని సమయంలో నీ భర్త ఎక్కడ అంటూ కొందరు దుండగులు హంగామా చేశారు. నీ భర్త వెంకటేశం ఎక్కడున్నాడు అంటూ బెదించారు. అతడిని చంపేస్తామంటూ తనపై దాడి చేశారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సిఐ తెలిపారు.

కలప అక్రమ రవాణా

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి రేంజ్ అంసాన్‌పల్లి సెక్షన్ పరిధిలో కలప అక్రమ రవాణా చేస్తున్న డీసీఎంను సీజ్ చేసినట్టు సెక్షన్ అధికారి జలీల్, బీట్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. తరలిస్తున్న కలప వివరాలను డీఎఫ్‌కు పంపామన్నారు. కలప రకం, నాణ్యత, బరువు ఆధారంగా డీఎఫ్ఓ జరిమానా విధిస్తారన్నారు. అనుమతి లేకుండా కలప తరలించడం చట్టరీత్యా నేరమన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.


రాజు

నారాయణఖేడ్: పట్టణ శివారులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం... కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన కుమ్మరి రాజు (32) పట్టణంలోని ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక...


విఠల్‌గౌడ్(ఫైల్)

కల్హేర్(నారాయనఖేడ్): కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కల్హేర్ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన అబ్బెంద విఠల్‌గౌడ్(24) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన పంచాయితీ

హుస్నాబాద్‌రూరల్: భూవివాదం నేపథ్యంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన వేల్పు ఏలియా(45)కు సోదరుడి కుటుంబానికి మధ్య రెండు గుంటల భూమి విషయంలో పంచాయితీ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తన ఇంటిరేకులు ధ్వంసం చేయడమే కాకుండా, అమ్మను కూడా తింటాడంటూ సోదరుడి కుమారుడైన స్వామి రెండు రోజులు క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దమనుషుల దగ్గర పంచాయితీ పెట్టారు. రెండు రోజుల సమయం ఇచ్చారు. ఈ క్రమంలో మహిళలు ఏలియాను బూతులు తిట్టారు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం పొలం వద్దకు వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త చావుకు పాలివారే కారణమంటూ వేల్పుల భాగ్య, వేల్పు ప్రసూన, స్వామి, తిరుమల, సందీప్, పొన్నాల సుధాకర్, పద్మ, వజ్రమ్మలపై మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు.

యువకుడి అదృశ్యం

సిద్దిపేటఅర్బన్: ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన దండబోయిన విక్రాంత్ (23) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. సంవత్సరం క్రితం ప్రేమ వివాహం చేసుకొని సిద్దిపేటలోని మైత్రి వనంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 19న ప్రోగ్రాం ఉందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతని భార్య రాణి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.


విక్రాంత్ (ఫైల్)

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన గొవ్వలేగి మరియమ్మ(60) నర్సయ్య దంపతులు. వీరు పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరియమ్మ కొడుకు, కోడలు భాస్కర్, చంద్రకళ మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 20న కొడుకు, కోడలు మళ్లీ గొడవ పడ్డారు. ఈ గొడవతో తీవ్ర మనస్తాపానికి గురైన మరియమ్మ విషగుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరియమ్మ మృతి చెందింది. మృతురాలి కొడుకు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్‌ఐ చంద్రమోహన్‌యాదవ్‌తో కలసి మండల కేంద్రంతో పాటు అయినాపూర్‌లోని సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. రైతుమిత్ర ఫర్టిలైజర్ కొమురవెల్లి, తెలంగాణ ఆగ్రో ఫర్టిలైజర్స్‌లలో కాలం చెల్లిన కంది విత్తనాలు, వివిధ రకాల కాలం చెల్లిన పురుగు మందులు స్వాధీనం చేసుకొని వ్యవసాయ అధికారి నరేష్‌కు అప్పజెప్పారు. సీఐ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు పురుగు మందులు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


రైతుమిత్ర ఫర్టిలైజర్ షాప్‌లో తనిఖీ నిర్వహిస్తున్న చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి...

జహీరాబాద్: పట్టణంలోని బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(30) మరణించాడు. శుక్రవారం రాత్రి అల్గోల్ క్రాస్ రోడ్డు వద్ద 65వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే పోలీసులు క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి ఒంటిపై ఎర్రరంగు షర్టు ధరించి ఉన్నాడు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కార్మికుడికి గాయాలు


గాయపడిన సింహాచలం

జిన్నారం(పటాన్‌చెరు): వాహనం ఢీకొనడంతో ఓ కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన కార్మికుడు సింహాచలం బొల్లారంలోని ఓ షాపులో వస్తువులు కొనుగోలు చేస్తున్నాడు. ఆ సమయంలో ఓ భారీ వాహనం వెనక్కి రావడంతో అక్కడే ఉన్న సింహాచలాన్ని ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్సం నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్‌కు ..

జహీరాబాద్ టౌన్: కంటెయినర్ లారీని మరో లారీని ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్‌లోని మహీంద్ర కర్మాగారంలో తయారైన ట్రాక్టర్లను లోడ్ చేసుకుని ముంబయి వెళుతున్న కంటెయినర్‌ను జాతీయ రహదారిపై సత్వార్ గ్రామ శివారులో గురువారం రాత్రి మరో లారీకి ఢీకొట్టింది. ఈ ఘటనలో కంటెయినర్‌లోని పలు ట్రాక్టర్లు దెబ్బతినగా, డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న చిరాగ్‌పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.